


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఆదిలాబాద్

మంచిర్యాల
నిర్మల్ - కొమరం భీం
ఆసిఫాబాద్

శనివారం 21 ఫిబ్రవరి 2026 పేజీలు 04




గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కారంపై

## ప్రత్యేక చర్యలు

- విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి
- విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా కృషి
- విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటిని అందించాలి
- వంట సమయంలో సిబ్బంది పరిశుభ్రత నిబంధనలను పాటించాలి
- జిల్లా కలెక్టర్ కె.హరిత



**తిర్యాణి,సూర్య మేజర్ న్యూస్ :** జిల్లాలోని గురుకుల పాఠశాలలలో నెలకొన్న సమస్యల పరిష్కారం పై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లాలోని తిర్యాణి మండలం చింతపల్లి గ్రామంలో గల గిరిజన సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలను ఆకస్మికంగా సందర్శించి పాఠశాల తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, త్రాగునీరు, పరిసరాల పరిశుభ్రత అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతుందని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా కృషి చేస్తుందని తెలిపారు. వేసవికాలం సమీపిస్తున్నందున నీటి సమస్య లేకుండా నీటి లభ్యత ఉన్న ప్రాంతంలో బోర్ వెల్ ఏర్పాటు చేసే దిశగా గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, వంట సమయంలో సిబ్బంది పరిశుభ్రత నిబంధనలను పాటించాలని తెలిపారు. డార్మెటరీ గదిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, డ్రైనేజీ వ్యవస్థ పకడ్బందీగా నిర్వహించాలని, మూత్రశాలలకు తలుపులు ఏర్పాటు చేయాలని, మురుగు కాలువల నిర్మాణాలకు అంచనా ప్రతిపాదనలు రూపొందించాలని తెలిపారు. విధుల పట్ల సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేసి మరోసారి ఆలస్యం కాకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులను మార్చాలని విద్యార్థులు కోరగా ప్రిన్సిపాల్ ను వెంటనే ఇతర ప్రాంతానికి డిప్యూటేషన్ పై పంపించి సీనియర్ ఉపాధ్యాయురాలు రమ్య కు ఇంచార్జ్ ప్రిన్సిపాల్ బాధ్యతలను అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలలో కల్పిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యా బోధన తీరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఇంజనీరింగ్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



---



నిర్మాణ పనులను

## వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల,సూర్య మేజర్ న్యూస్ :** జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులను ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం ఆసుపత్రి నిర్మాణ పనులను చేపట్టిందని, ఈ క్రమంలో పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. 129.25 కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయలతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆసుపత్రి పరిధిలో చేపట్టిన మార్చురీ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం పట్టణంలోని సాయికుంటలో చేపట్టిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

ఆదిలాబాద్ పట్టణంలో రాకపోకలు భారీ వాహనాలు

## అనుమతి లేదు



**ఆదిలాబాద్, ఫిబ్రవరి 17: మేజర్ సూర్య న్యూస్:** పట్టణ ప్రజల భద్రత , ట్రాఫిక్ క్రమబద్ధీకరణ దృష్ట్యా జిల్లా కేంద్రంలో కీలక ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ బి. ప్రణయ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రతిరోజూ ఉదయం 8:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు.తాంసి బస్టాండ్ సమీపంలో జరుగుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు భారీ వాహనాలను పట్టణంలోకి అనుమతించరు.

ఆంక్షలు వర్తించే ప్రాంతాలు:


ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఈ క్రింది మార్గాల్లో ఆంక్షలు కఠినంగా అమలు చేయబడతాయి:మావల నుండి వచ్చే వాహనాలు తిరుమల పెట్రోల్ బంక్ , రైల్వే స్టేషన్ వరకు మాత్రమే అనుమతి.ఆర్టీవో కార్యాలయం రైల్వే గేటు నుండి 'ఐలవ్ ఆదిలాబాద్' జంక్షన్ వరకు పట్టణం లోపలికి వాహనాల రాకపోకలపై నియంత్రణ ఉంటుంది.ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా నిర్మాణ పనులు జరుగుతున్నందున ప్రమాదాలను నివారించడానికి వాహనదారులు పోలీసు శాఖకు సహకరించి, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని కోరారు.

---

సెక్యూరిటీ గార్డుల కోసం నిర్వహించిన

## టెండర్లలో భారీ అక్రమాలు

- సిపిఐ పట్టణ కార్యదర్శి కామెర దుర్గరాజ్




**మందమర్రి, సూర్య మేజర్ న్యూస్.** సింగరేణి ఏరియాలో 90 మంది అవుట్ సోర్సింగ్ సెక్యూరిటీ గార్డుల కేటాయింపు కోసం నిర్వహించిన టెండర్లలో నిబంధనలకు విరుద్ధంగా భారీ అక్రమాలు జరుగుతున్నాయని సిపిఐ పట్టణ కార్యదర్శి కామెరా దుర్గరాజ్ ఆరోపించారు. (మిగితా... 3లో )

---

వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ

## ప్రజా సంక్షేమం దిశగా చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల బ్యూరో, సూర్య మేజర్ న్యూస్ :** ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజా సంక్షేమం దిశగా చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని లక్సెట్టిపేట మండల కేంద్రంలో గల 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, ల్యాబ్, రిజిస్టర్లు, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించి మందులను అందుబాటులో ఉంచి ప్రజల సంక్షేమం కొరకు తగు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో వైద్యులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రి పరిధిలో కొనసాగుతున్న మార్చురీ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలలో రాణించిన విద్యార్థుల ప్రతిభ అభినందనీయం



## - జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

హైదరాబాద్ లో ఈ నెల 17వ తేదీన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీలలో రాణించిన జిల్లా విద్యార్థుల ప్రతిభ అభినందనీయమని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఆటల పోటీలలో పాల్గొని జిల్లా జట్టు 2వ స్థానం సాధించినందున విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెడల్ షీల్డ్ లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఇండోర్, అవుట్ డోర్ ఆటల పోటీలలో పాల్గొని జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చారని తెలిపారు. ఈ సాధనలో తమ వంతు పాత్ర పోషించిన ప్రతి ఒక్కరు అభినందనీయులని, మునుముందు జిల్లా పేరును ముందు వరసలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల స్పోర్ట్స్ ఇన్చార్జి శాంతి కుమార్, ఐ ఈ ఆర్ పి లు సతీష్, సుజాత, రమణ, ప్రత్యేక విద్యావేత్త మహేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు

## - సైబర్ క్రైమ్ ఏఎస్ఐ బి. సురేందర్

**ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్**

డిస్ట్రిక్ట్ సైబర్ క్రైమ్ యూనిట్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు. సైబర్ క్రైమ్ ఏఎస్ఐ బి. సురేందర్ ఆధ్వర్యంలో నూతనంగా



ఎన్నికైన సర్పంచ్‌లకు, ఉట్నూర్ లోని వైటిసి, కేబీ కాంప్లెక్స్ లో మహిళలకు, అలాగే భుక్తాపూర్‌లోని వెటర్నరీ జిల్లా కార్యాలయంలో వెటర్నరీ వైద్యులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించబడింది. ఈ కార్యక్రమాలలో ప్రజలను మోసం చేస్తున్న పలు సైబర్ నేరాల గురించి వివరించారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, మ్యూల్ అకౌంట్స్, సైబర్ స్లేవరీ, నకిలీ ఏపీకే ఫైల్స్ ద్వారా జరిగే మోసాలు, లోన్ యాప్ మోసాలు, ఓటీపీ మరియు కే వై సి అప్‌డేషన్ పేరుతో జరిగే మోసాలు, పార్ట్ టైమ్ జాబ్స్ మోసాల గురించి సమగ్రంగా అవగాహన కల్పించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే గోల్డెన్ అవర్ ఎంతో ముఖ్యమని, వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయడం వల్ల డబ్బులు తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమం ముగింపులో సైబర్ నేరాల రకాలు, జాగ్రత్తలు మరియు ఫిర్యాదు విధానాలపై వివరాలతో కూడిన ముద్రిత పాంప్లెట్లు పంపిణీ చేయడం జరిగింది. ప్రజలు అప్రమత్తంగా ఉండి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ పంచుకోరాదని, అనుమానాస్పద కాల్స్, లింకులు, యాప్‌లను నివారించాలని సైబర్ క్రైమ్ ఏఎస్ఐ బి. సురేందర్ విజ్ఞప్తి చేశారు.

# ఈజీఎస్ పథకంపై

## అవగాహన కల్పిస్తున్న ఏపీడీ నాగవర్ధన్.

**దస్తురాబాద్, ఫిబ్రవరి20 ,సూర్య మేజర్ న్యూస్:**

ఈజీఎస్ పథకంతో ఆర్థికంగా లబ్ది చెందవచ్చు అని ఈజీఎస్ ఏపీడీ నాగవర్ధన్ అన్నారు. మండలంలోని రేవోజిపేట గ్రామంలోని గ్రామ



పంచాయతీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులకు, రైతులకు ఈజీఎస్ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భాంగా ఆయన మాట్లాడుతూ ఈజీఎస్ పథకంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. రైతులు ఈజీఎస్ పథకాన్ని వినియోగించుకోని లబ్ది చెందాలని సూచించారు. కాగా అంతకుముందు గ్రామంలో జరుగుతున్న ఈజీఎస్ పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి, పని చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోల మహేశ్ వార్డు సభ్యులు, ఏపివో రవి ప్రసాద్ పంచాయ కార్యాదర్శి గోవర్ధన్, టీఏ గోవింద్, ఫిల్డ్ అసిస్టెంట్ రాజన్న, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు లోక శరత్ రెడ్డి, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్ పర్సన్ విజయోత్సవ ర్యాలీ

## - బండారి అనూష

**ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్**

లౌకిక పార్టీల మద్దతుతో మున్సిపల్ పీఠం గెలుచుకున్నామని మతోన్మాద పార్టీకి షాకిచ్చామని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ చైర్ పర్సన్



బండారి అనూష విజయోత్సవ ర్యాలీలో కీలక నేతలందరితో కలిసి వారు పాల్గొన్నారు. అటు తనకు పదవి కట్టబెట్టిన బీఆర్ఎస్, ఎంఐఎం, స్వతంత్ర కౌన్సిల్ సభ్యులకు, ప్రజలకు కీలక పాత్ర పోషించిన నేతలకు అనూష కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో ఆదిలాబాద్ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం డీసీసీ కార్యాలయం నుండి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లగుండా కొనసాగింది. పెద్ద ఎత్తున హాజరైన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానుల జై కాంగ్రెస్ నినాదాలతో ర్యాలీ ఆసాంతం దద్దరిల్లింది. ర్యాలీ పొడువునా వాహనం పై నుండి మున్సిపల్ చైర్ పర్సన్ అనూష ప్రజలకు అభివాదం చేసారు. కాంగ్రెస్ శ్రేణులు కంది శ్రీనివాస రెడ్డిని అభిమానంతో తమ భుజానికెత్తుకుని నృత్యాలు చేసారు. ఆయన సైతం కండువా ఊపుతూ ఉత్సాహపరిచారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ళ గుండా శ్రేణులు కాంగ్రెస్ జెండాలు ఊపుతూ ఉత్సాహంగా ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు , నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దేవుని గుడినే దోచుకున్న దొంగలు

**కాగజ్నగర్,ఫిబ్రవరి 20, సూర్య మేజర్ న్యూస్ :**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని ఆర్ఆర్ఓ



కాలనీలోని ఎల్లమ్మ,,, పొచమ్మ గుడుల్లో బుధవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. గుడితాళాలు పగులగొట్టి రెండు హుండీలు, బంగారు నగలు, వెండి కిరీటాలు ఎత్తుకెళ్లిన దుండగులు,సీసీ కెమెరా ఫుటేజ్‌లో ఇద్దరు అనుమానితులు రికార్డు అయ్యారని,కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపిన పోలీసులు.

## జామా మసీదు నూతన కమిటీ సభ్యులకు

# చిరు సత్కారం

**మందమర్రి, ఫిబ్రవరి 20, సూర్య మేజర్ న్యూస్.**

పట్టణంలోని అంగడి బజార్ జామా మసీదు నూతన కమిటీ అధ్యక్షులుగా రహమత్ ఖాన్, ఉపాధ్యక్షులుగా ఖాదర్ ఎన్నికయ్యారు. శుక్రవారం మసీదులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మైనార్టీ సెక్రటరీ ఎండి అబ్బాస్ నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షులుగా ఎన్నుకున్న ముస్లిం సోదరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మసీదు అభివృద్ధికి, నిరుపేద ముస్లిం సోదరుల సంక్షేమానికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జామ మసీద్ ఇమామ్ అబ్దుల్ సమద్, ఎండి అన్వర్, మజార్, సలావుద్దీన్, ఎండీఅహమ్మద్, మున్వర్ బాబా, ఎండి అబ్బు, ఎండి జాఫర్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



## పత్తి కొనుగోలు గడువు పొడిగించాలి

# ..కోనేరు కోనప్ప

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 20, సూర్య మేజర్ న్యూస్ :**

సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పెంచికల్ పేట్ మండలంలో రైతులతో కలిసి పత్తి చేనులను పరిశీలించారు. వర్షాలు, కార్మికుల కొరత కారణంగా అనేక గ్రామాల్లో పత్తి కోత ఆలస్యమవుతోందని,సీసీఐ పత్తి కొనుగోళ్లు ఫిబ్రవరి 20తో ముగిసినా, మార్చి 15 వరకు గడువు పొడిగించాలని డిమాండ్ చేశారు. రైతులు ఎంఎస్పి కు పత్తి అమ్మే అవకాశం కోల్పోకుండా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెంచికల్ పేట్ మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు రైతులు పాల్గొన్నారు.



# ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్

## .. విజేతలకు బహుమతులు ప్రధానం

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 20, సూర్య మేజర్ న్యూస్ :**

పెంచికల్ పేట్ మండలంలోని గుంట్లపేట గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో జీపీ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ శుక్రవారం రోజు ముగియడంతో ఫైనల్ మ్యాచ్ కి సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఫైనల్లో విజేతగా నిలిచిన గుంట్ల పెట్ జట్టుకు 15000 రూపాయలు, రన్నర్ అఫ్ గా నిలిచిన తలయి జట్టుకు 10000 రూపాయల నగదుతో పాటు ట్రోఫీలు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడలలో ముందుండాలని దీనితో పాటు విద్యలోను ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు దుర్గం పోషన్న, చౌదరి శ్రీనివాస్, జాజిమొగ్గ శ్రీనివాస్,కౌన్సిలర్ భైరిశెట్టి రవి, నాయకులు చౌదరి బండన్న,షేక్ బాబు, సయ్యద్ సాజీత్, వెంకన్న, మారయ్య, వెంకటాచలం, రాకేష్, క్షేత్ర చిట్ ఫండ్ ఎండీ ఎంబటి అంజన్న,మేనేజర్ బండి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## కంప్యూటర్లు అందించేందుకు సింగరేణి సంస్థ ముందుకు రావడం

# అభినందనీయం

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**

**ఆసిఫాబాద్ టౌన్,ఫిబ్రవరి20,సూర్య మేజర్ న్యూస్**



సామాజిక బాధ్యతలు భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు అందించేందుకు సింగరేణి సంస్థ ముందుకు రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో కార్పొరేట్ కంపెనీల బాధ్యతలు భాగంగా సింగరేణి సంస్థ జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలో ఎక్కువ విద్యార్థులు కలిగిన 4 పాఠశాలలకు కంప్యూటర్లు అందజేసే కార్యక్రమంలో భాగంగా సింగరేణి సంస్థ గోలేటి జనరల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి తో కలిసి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కంప్యూటర్లు, ప్రింటర్లు, సిపియు లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యతతో భాగంగా సింగరేణి సంస్థ జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలలకు కంప్యూటర్లు అందించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో పాఠశాలలలో మౌలిక వసతుల కల్పనలో సహకారం అందించాలని తెలిపారు. సింగరేణి సంస్థ 11 కంప్యూటర్లు, 11 సిపియులు, 5 ప్రింటర్లు అందించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ప్రణాళిక సమన్వయకర్త ఆబిద్ అలీ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సెక్యూరిటీ గార్డుల కోసం నిర్వహించిన టెండర్లలో

# భారీ అక్రమాలు

**- సిపిఐ పట్టణ కార్యదర్శి కామెర దుర్గరాజ్**

మొదటి పేజీ తరువాయి...

శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి,అర్హత లేని సంస్థలకు టెండర్లు కట్టబెట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మాధవ్ సెక్యూరిటీ సర్వీస్,తిరంగ సెక్యూరిటీ అండ్ అవుట్ సోర్సింగ్ సర్వీసెస్ సంస్థలకు సరైన ధృవీకరణ పత్రాలు లేవని పేర్కొన్నారు. అధికార పార్టీకి చెందిన మంత్రులు, నేతల అండతో అధికారులపై ఒత్తిడి తెచ్చి ఫైళ్లను వేగంగా కదిలిస్తున్నారని మండిపడ్డారు.ఎల్1 కాంట్రాక్టర్ టెండర్ డ్రా పద్ధతిలో ఎంపికైన తర్వాత హోమ్ డిపార్ట్మెంట్‌కు చెందిన పసరా (పిఎస్ఎఆర్ఎ) లైసెన్స్‌ను ఒక్క రోజులోనే సృష్టించి సమర్పించారని దుర్గరాజ్ తెలిపారు. వర్క్ ఆర్డర్ తేదీలు,జిఎస్టి వివరాలు పొంతన లేకుండా ఉన్నాయని,ఈఎస్ఐ, పిఎఫ్ బిల్లులు,బ్యాంక్ స్టేట్మెంట్లను నిశితంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఎల్2 కాంట్రాక్టర్‌కు సంబంధించి ఫైనాన్షియల్ ఇయర్‌లో ఒక నెల తక్కువగా ఉందని,పసరా లైసెన్స్ వచ్చి రెండు నెలలు కూడా కాకముందే ఏడాది అనుభవం ఉన్నట్లు పత్రాలు ఎలా సమర్పిస్తారని ప్రశ్నించారు.ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ రెగ్యులేషన్ యాక్ట్ 2005 ప్రకారం లైసెన్స్ రాకముందు చేసిన పని అనుభవంగా చెల్లదని స్పష్టం చేశారు. కొన్ని సంస్థల వద్ద పని చేయకపోయినా చేసినట్లుగా తప్పుడు పత్రాలు సృష్టించారని ఆరోపించారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా పారదర్శకంగా వ్యవహరించాలని,పూర్తిస్థాయి డాక్యుమెంట్లు ఉన్న వారికే టెండర్ కేటాయించాలని,లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

## పదో తరగతి అంతర్గత మార్కుల ధృవీకరణ

**చింతలమానేపల్లి, ఫిబ్రవరి 20, సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని హైస్కూల్‌లలో పదో తరగతి అంతర్గత మార్కుల ధృవీకరణ ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు జెడ్పిహెచ్ఎస్



బాబాసాగర్ సహా పలు పాఠశాలలను సందర్శించి రికార్డులు, హాజరు పట్టీలు, మార్కుల నమోదు పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థుల ప్రదర్శన ఆధారంగా నిబంధనలకు అనుగుణంగా అంతర్గత మార్కులు కేటాయించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మార్కుల కేటాయింపులో పారదర్శకత పాటిస్తూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈ తనిఖీలు కొనసాగనున్నట్లు తెలిపారు.

## జన్నారం మండల పురగిరి క్షత్రియ (పెరిక) సంఘం నూతన అధ్యక్షుడిగా కానగంటి శివలింగు ఏకగ్రీవ ఎన్నిక

**జన్నారం, ఫిబ్రవరి 20, సూర్య మేజర్ న్యూస్ :** జన్నారం మండలంలోని పురగిరి క్షత్రియ (పెరిక) సంఘం నూతన కమిటీ ఎన్నికలు ఘనంగా నిర్వహించబడ్డాయి. పురగిరి క్షత్రియ సంఘ సభ్యుల సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ



అధ్యక్షులుగా ఎంబడి సత్యం, అధ్యక్షులుగా కానగంటి శివలింగు, ప్రధాన కార్యదర్శిగా గూడ అశోక్‌లను సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.ఈ ఎన్నికల ప్రక్రియ మంచిర్యాల జిల్లా కమిటీ అధ్యక్షులు బొడ్డు శంకర్, ప్రధాన కార్యదర్శి చుంచు రాజకిరణ్, బొడ్డు తిరుపతి, సంగా మనయ్య, చెల్లా విశ్వం, పయ్యావుల ముని ఆధ్వర్యంలో సజావుగా సాగింది. సంఘం ఐక్యతను ప్రతిబింబించే విధంగా ఎటువంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికలు పూర్తి కావడం విశేషంగా నిలిచింది. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు కానగంటి శివలింగు మాట్లాడుతూ సంఘ అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, యువతలో చైతన్యం కల్పించడం, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. సంఘం బలోపేతానికి అందరి సహకారం అవసరమని, పరస్పర ఐక్యతతో ముందుకు సాగితే మరింత పురోగతి సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు.గౌరవ అధ్యక్షులు ఎంబడి సత్యం మాట్లాడుతూ సంఘ పరంపరలను కాపాడుతూ కొత్త కమిటీ సమర్థవంతంగా పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాన కార్యదర్శి గూడ అశోక్ సంఘ కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సంఘం అధ్యక్షులు కానగంటి శివలింగు మాట్లాడుతూ సంఘ భవనం కోసం గుంట నర భూమిని విరాళంగా ఇస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో జన్నారం మండల పురగిరి క్షత్రియ (పెరిక) సంఘం ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పెద్దలు, యువకులు, మహిళా సభ్యులు విస్తృతంగా పాల్గొన్నారు. నూతన కమిటీ ఎన్నికపై పురగిరి క్షత్రియ కులస్తులు హర్షం వ్యక్తం చేస్తూ నూతన బాధ్యతలు చేపట్టిన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

## సర్వే పనులను పారదర్శకంగా నిర్వహించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య**

**మంచిర్యాల,ఫిబ్రవరి 20, సూర్య మేజర్ న్యూస్ :**

ప్రభుత్వం నిర్దేశించిన సర్వే పనులను ఎలాంటి అవకతవకలకు తావు



లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా భూ కొలతల అధికారి శ్రీనివాస్ తో కలిసి లైసెన్స్ సర్వేయర్ శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన సర్వే పనులను లైసెన్స్డ్ సర్వేయర్లు ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా పారదర్శకంగా నిర్వహించాలని, జిల్లాలో భూ సమస్యల పరిష్కారానికి సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా లైసెన్స్ సర్వేయర్ శిక్షణ పొంది ఉత్తీర్ణులైన 99 మంది లైసెన్స్డ్ సర్వేయర్లకు లైసెన్స్ ధ్రువీకరణ పత్రాలు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి, సర్వే సిబ్బంది, లైసెన్స్డ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

# బొంబాయిగూడలో

## అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 20, సూర్య మేజర్ న్యూస్ :**

పెంచికల్ మండలం బొంబాయిగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామస్తులు,ఆలయ కమిటీ సహకారంతో ఈ పవిత్ర కార్యక్రమం వందలాది భక్తుల ఆకర్షణకు కారణమైంది.వేద పండితులు బాచంపల్లి కమలాకర్ శర్మ ఆధ్వర్యంలో యాగశాల కార్యక్రమాలు, వైదిక క్రియలు ఘనంగా నిర్వహించారు. సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రధాన అతిథులుగా హాజరై, పూజల్లో పాల్గొని వేద పండితుల ఆశీర్వచనం పొందారు.అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేసి, మహోత్సవాన్ని మరింత వైభవంగా



మార్చారు.ఈ ఆలయం గ్రామంలో ఆధ్యాత్మిక కేంద్రంగా, భక్తుల ఆశ్రయంగా మారనుందని ఆనందం వ్యక్తం చేశారు. స్థానికులు స్వామివారి కృపతో గ్రామ శ్రీకారం జరుగుతుందని గ్రామవాసులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు,స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు,మహిళలు, యువకులు,భక్తులు పాల్గొన్నారు.

## చైల్డ్ పోర్న్ వీడియోలు చూస్తే చర్యలు తప్పవు,

# చట్టరీత్యా నేరం

**- తెలంగాణ రాష్ట్ర సైబర్ టీం ద్వారా ప్రత్యేక దృష్టి- ఇదివరకే జిల్లాలో ఐదు కేసులు నమోదు - వయసు పైబడిన వారు చూస్తూ కేసుల పాలవడం గమనార్హం- ఎస్పీ అఖిల్ మహాజన్**



**ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్**

కొంద మంది వ్యక్తులు చైల్డ్ పోర్న్ వీడియోలు చూడటం, వాటిని మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేయడం, ఆన్లైన్ బ్రౌజర్ల ద్వారా వీక్షించడం, వాటిని సోషల్ మీడియాలో అప్లోడ్ చేయడం, ఫార్వార్డ్ చేయడం వంటి చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఇటువంటి చర్యలు చట్టరీత్యా నేరమని, వీటిని ఎంతమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు.ముఖ్యంగా చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం లేదా గూగుల్‌లో వాటి కోసం వెతకడం వంటి చర్యలను జిల్లా పోలీస్ శాఖ తీవ్రంగా పరిగణిస్తుందని ఆయన స్పష్టం చేశారు. చైల్డ్ పోర్నోగ్రఫీ అనేది ఒక తీవ్రమైన నేరమని, దీనికి పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠినమైన పోక్సో కేసులు చేయబడతాయని హెచ్చరించారు.పోర్న్ వీడియోలు చూడటం,వాటిని తయారు చేయడం, వాటిక వెతకడం మరియు మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేయడం వంటి కార్యకలాపాలు సమాజంలో అసభ్యతను వ్యాప్తి చేయడమే కాకుండా,మహిళలు మరియు పిల్లల గౌరవాన్ని దిగజారుస్తాయి. అంతేకాకుండా, ఇది సైబర్ నేరాల పరిధిలోకి వస్తుంది,సంబంధిత చట్టాల ప్రకారం కఠినమైన శిక్షార్హమైన చర్యలకు దారితీస్తుంది.జిల్లాలో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై సైబర్ క్రైమ్ ద్వారా నిందితులను గుర్తించి, వారిపై తగిన కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇదివరకే ఆదిలాబాద్ జిల్లా నందు ఐదు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వయసు పైబడిన వారు చైల్డ్ పోర్న్ చూస్తూ కేసుల పాడవడం జరిగిందని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు ఐదు కేసులు నమోదు చేసి నిందితులను అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. పిల్లల పై జరుగు అత్యాచార వీడియోలను చూస్తే హైదరాబాద్ చైల్డ్ టిప్ లైన్ వారు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉంటారని, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించడం జరుగుతుందని తెలిపారు.ప్రజలందరూ ఇటువంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు దూరంగా ఉండాలని,ముఖ్యంగా యువత సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఉపయోగించాలి,తప్పుదోవ పట్టించే విషయాల పట్ల అప్రమత్తంగా ఉండాలి అని తెలిపారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల సోషల్ మీడియా వినియోగంపై నిఘా ఉంచాలని, వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఒకవేళ ఎవరైనా ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడినట్లు గుర్తిస్తే, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.జిల్లా పోలీస్ శాఖ ప్రజల భద్రత మరియు శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి ఉందని, ఇటువంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడానికి అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

## యూరియా బుకింగ్ ఆప్ పై
# రైతులకు అవగాహన

**మందమర్రి, ఫిబ్రవరి 20, సూర్య మేజర్ న్యూస్.**

రైతులకు ఎరువుల సరఫరాను పారదర్శకంగా, సమయానికి అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన యురియా బుకింగ్ యాప్ పై వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి మండలంలోని రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని ఆదిల్ పేట గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ గత సీజన్ లో యూరియా అందుబాటులో లేక గతంలో జరిగిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా యూరియా బుకింగ్ యాప్ ని ప్రవేశపెట్టి రైతులకు సులభతరంగా యూరియా పొందుటకు మార్గం సుగమం చేసిందన్నారు. ఇట్టి ఆప్ ని గూగుల్ ప్లే స్టోర్ నుండి రైతులంతా డౌన్లోడ్ చేసుకుని, యాప్ నందు రైతు పట్టాదారు పాసుపుస్తకంతో లింకు ఉన్న మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి తనకు అందుబాటులో ఉన్న డీలర్ వద్ద నుండి సాగు ఎకరాలను, పంటను బట్టి రెండు మూడు దఫాలుగా యూరియాను పొందవచ్చునని, రైతు తన గ్రామ పరిధిలోని వివిధ డీలర్ల వద్ద అందుబాటులో ఉన్న యూరియా బస్తాల వివరాలను కూడా తెలుసుకోవచ్చునని, అంతే కాకుండా జిల్లా పరిధిలో ఎక్కడి నుండైనా ఈ యాప్ ద్వారా యూరియా పొందవచ్చని సూచించారు. ప్రతి రైతు కేవలం యూరియా బుకింగ్ యాప్ ఉపయోగించి ప్రస్తుత పంట కాలానికి యూరియాను పొందవలసి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫెర్టిలైజర్ డీలర్, ఆదిల్ పేట, సారంగపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేకు సన్మానం

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 20, సూర్య మేజర్ న్యూస్ :**

బొంబాయిగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా





జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే హరీష్ బాబు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో గ్రామస్తులు, కమిటీ సభ్యులు భక్తిభావంతో పాల్గొన్నారు. ఈ ఆలయ నిర్మాణం గ్రామంలో ఆధ్యాత్మిక మేలు పెంచుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.ఈ ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎల్లూర్‌లో ఉచిత టీబీ పరీక్షలు

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి20, సూర్య మేజర్ న్యూస్ :**

ప్రధానమంత్రి టీబీ ముక్తా భారత అభియాన్‌లో భాగంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్లూర్ గ్రామంలో సర్పంచ్ చప్పిడి రవీందర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అస్రీన్



తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 100 మందికి హ్యాండ్ ఎక్స్రే యంత్రం ద్వారా టీవీ స్క్రీనింగ్ నిర్వహించినట్లు తెలిపారు.ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పరీక్షలు చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో హోమియో వైద్యాధికారి సతీష్, టెక్నీషియన్ సునీల్, సిహెచ్ఓ మరియు ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## బోరంచు శ్రీకాంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ దంపతులు..

**మావల, సూర్య మేజర్ న్యూస్**

నూతనంగా ఎన్నికైన ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ దంపతులు తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డిని మావలలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డిని శాలువాతో సన్మానించి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి వారి కుటుంబ సభ్యులతో కలిసి చైర్మన్ దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో సీనియర్ నాయకులు విజయ దామోదర్ రెడ్డి, మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, అట్ల గోవర్ధన్ రెడ్డి, రేండ్ల రాజన్న, రావుల ప్రవీణ్, మోసిన్ , దోసలి సంతోష్, ఆరె గంగన్న, కొత్తపల్లి అడెల్లు , గంగన్న తదితరులు పాల్గొన్నారు.

## వెంకటాపూర్ గ్రామ హనుమాన్ ఆలయంలో నూతన బోరు మోటారు బిగింపు నీటి ఎద్దడి తొలగించిన గ్రామ సర్పంచ్ సెగ్గం వెంకటేష్

**మందమర్రి, ఫిబ్రవరి 20, సూర్య మేజర్ న్యూస్.** మండలంలోని వెంకటాపూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయ ఆవరణలో గత కొన్ని నెలలుగా నిర్వీర్యంగా ఉన్న బోరు మోటారు సమస్య చివరకు పరిష్కారమైంది. వెంకటాపూర్ సర్పంచ్ సెగ్గం వెంకటేష్ ప్రతిష్టాత్మక ప్రయత్నాలతో శుక్రవారం నూతన మోటారును బిగించి మళ్లీ పనిచేసేలా చేశారు. బోరు మోటారు పనిచేయకపోవడంతో ఆలయ పరిసరాల్లో నీటి కొరత ఏర్పడి, భక్తులకు, ఆలయ నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. ప్రత్యేకించి ఉదయం, సాయంత్రపు పూజా కార్యక్రమాల్లో నీటి లభ్యత పెద్ద సమస్యగా మారింది. సమస్యను గ్రామ సర్పంచ్ సెగ్గం వెంకటేష్ కు గ్రామస్థులు తెలుపగా ఆయన ప్రత్యేక చొరవ తీసుకొని మోటారు మరమ్మత్తులకు ఆయన ముందుకొచ్చారు. టెక్నీషియన్‌ను పిలిపించి నూతన మోటారు బిగించడంతో తిరిగి సజావుగా పనిచేస్తోంది. నీటి సరఫరా పునరుద్ధరణతో భక్తులు, గ్రామస్తులు ఆయనను అభినందించి, ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సెగ్గం వెంకటేష్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా ఆలయంలో నీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడి కాలనీవాసులు, భక్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వారి ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొని నూతన మోటార్ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో నీటి ఎద్దడి లేకుండా కృషి చేసి రక్షిత మంచినీటి సౌకర్యం కల్పిస్తానని స్పష్టం చేశారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిద్ధుల రాజేశ్వరి, వార్డ్ సభ్యులు వేల్పుల మహేశ్వరి - సాగర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 10వ తరగతి ఉద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం

**భీమిని,ఫిబ్రవరి21,సూర్య మేజర్ న్యూస్:**

భీమిని మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు " మండల స్థాయి అధికారుల సంఘం" తరపున "పదవ తరగతి విద్యార్థిని,విద్యార్థులకు శనివారం ప్రేరణ కార్యక్రమం" ఏర్పాటు చేయడమైనదని ఎంపీ డి ఓ బి ,గంగా మోహన్ ప్రకటనలో తెలిపారు, కార్యక్రమం భీమిని రైతు వేదిక యందు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో విద్యార్థులకు ఎస్ఎస్సి బోర్డు పరీక్షలపై అవగాహన కల్పిస్తూ, తదనంతర చదువులలో కెరియర్ ప్లానింగ్, గైడెన్స్ సంబంధించి ప్రేరణ కల్పించబడును. మండలంలోని అందరూ మండల స్థాయి అధికారుల ద్వారా విద్యార్థులకు పరీక్షలపై అవగాహన మరియు ప్రేరణ కల్పించబడును .అదేవిధంగా సుప్రజా పీపుల్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ సొసైటీ బెల్లంపల్లి వారు స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేస్తున్నారు. అదేవిధంగా మండల స్థాయి అధికారుల సంఘం తరపున పరీక్షలలో అవసరమయ్యే పూర్తి సామాగ్రిని ప్రతి విద్యార్థిని విద్యార్థికి ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు.

## రాష్ట్ర స్థాయి కుంగ్ ఫూ కరాటే పోటీలను జయప్రదం చెయ్యండి

**మందమర్రి, ఫిబ్రవరి 20, సూర్య మేజర్ న్యూస్.**

పట్టణంలోని శ్రీకృష్ణ గార్డెన్ లో ఈ నెల 22 న నిర్వహించనున్న తొమ్మిదవ తెలంగాణ రాష్ట్ర స్థాయి కుంగ్ ఫూ కరాటే పోటీలను జయప్రదం చేయాలని నిర్వాహకులు రంగు శ్రీనివాస్ కోరారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువతకు దేహదారుఢ్యంతో పాటు వ్యాయామం, స్వీయ రక్షణ, పొందేందుకు కుంగ్ ఫూ



కరాటే క్రీడల ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. యువతలో ఆత్మరక్షణ విశ్వాసం పెంపొందాలంటే కరాటే క్రీడల్లో నైపుణ్యం సాధించాలన్నారు. కరాటే పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు హరికృష్ణ, రంగు రమేష్, రమేష్ రాజా, రామ్మోహన్, కృష్ణ లు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆధార్ నెంబర్ ను బ్యాంకు ఖాతాతో
# అనుసంధానం చేయాలి
### - జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి

**మంచిర్యాల,ఏప్రిల్ 20, సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ పథకం కింద విద్యార్థుల బ్యాంకు ఖాతాల ఆధార్ సీడింగ్, డి బి టి యాక్టివేషన్ త్వరితగతిన చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ లు తమ కళాశాలల విద్యార్థుల బ్యాంకు ఖాతాలను ఆధార్ తో అనుసంధానం చేయాలని, సంబంధిత బ్యాంక్/ ఝఝ అజూఎఴ.శితీస్త్ర.ఖఅ ద్వారా డి బి టి కోసం ఫ్లాగ్ చేయడం తప్పనిసరి అని తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ, పి జి, ఇంజనీరింగ్ (ప్రొఫెషనల్, నాన్ ప్రొఫెషనల్) ఇతర కళాశాలల ప్రిన్సిపాళ్ళు తమ కళాశాలలోని బిసి, ఈ బి సి విద్యార్థులకు డి బి పి యాక్టివేషన్ కొరకు ఆధార్ నంబర్ ను వారి బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేయాలని తెలిపారు. తమ కళాశాలల నోటీస్ బోర్డ్ లో దశలవారీగా మార్గదర్శకాలు ప్రదర్శించడం ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని, 2025- 26 విద్యా సంవత్సరానికి సి ఎస్ ఎస్ బడ్జెట్ క్రింద బి సి, ఈ బి సి పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ మంజూరు, పంపిణీకి ఈ చర్య అత్యవసరమని తెలిపారు.

## ఘనంగా వీడ్కోలు సమావేశం
### - ముఖ్య అతిథిగా పాల్గొన్న వన్ టౌన్ సి ఐ సునీల్ కుమార్

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 20,సూర్య మేజర్ న్యూస్**

పట్టణంలోని విద్యార్థి జూనియర్ కళాశాలలో శుక్రవారం మొదటి సంవత్సరం విద్యార్థులు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కళాశాలలో తమ అనుభవాలను ప్రథమ సంవత్సరం విద్యార్థులతో పంచుకోవడం జరిగింది ఉల్లాసంగా ఉత్సవంగా కేరింతలతో సంతోషాలను పంచుకున్నారు ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సి ఐ సునీల్ కుమార్ మాట్లాడుతూ మొబైల్ ఫోన్ కు దూరంగా వుండి భవిష్యత్తు కు



సంబందించిన చదువు పై దృష్టి పెట్టలని పేర్కొన్నారు అలాగే ఆడపిల్లలకోసం షి టీం ఎప్పుడూ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువు కొని మంచి మార్కులతో కళాశాలకి, తల్లి తండ్రులకు మంచి పేరు తేవాలని పేర్కొన్నారు మరియు ఇట్టి కార్యకమంలో ముఖ్య అతితులుగా రాములు రిటైర్డ్ హెడ్ మాస్టర్, సంజీవ్ రెడ్డి రిటైర్డ్ టీచర్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రావణ్ కుమార్, అధ్యాపకులు,, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## ఆదివాసీలకువెంటనే ఇంటి నంబర్లు విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలి..తుడుం దెబ్బ డిమాండ్

**మావల ఫిబ్రవరి 20,సూర్య మేజర్ న్యూస్:** మావల మండలంకొమరం భీమ్ కాలనీలో 2007 నుండి 2026 నేటి వరకు 19 సంవత్సరాలుగా నివసిస్తున్న ఆదివాసీలకు ఇండ్లకు ఇంటి నెంబర్లు, విద్యుత్ మీటర్లు కేటాయించాలని మున్సిపల్ కమిషనర్ మరియు టీజీ నపీడీసీల్ ఎస్ ఇ అదిలాబాద్ కార్యాలయల ముందర ఆదివాసీల ధర్నా అనంతరం మెమోరండం సమర్పించడం జరిగింది ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్ వెట్టి మనోజ్ తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ స్వాతంత్రం సిద్ధించి 77 సంవత్సరాలు గడిచిపోయినప్పటికీ ఇప్పటికీ ఆదివాసులకు కరెంటు లేక ఇంటి నెంబర్లు లేక విద్య వైద్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నరూ కావున తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి కొమరం భీం కాలనీ ఆదివాసుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారుఈ కార్యక్రమంలో గణేష్ తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మనోజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేణుక ఆదివాసి మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ,ఉయిక ఇందిర ఆదివాసి మహిళా సంఘం జిల్లా ఉపధ్యక్షురాలు ,సలాం వరుణ్ ఆదివాసి విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, కాలనీ ఆదివాసీలు పాల్గొన్నారు